క్లుప్తంగా

సీకేఎం ఆస్పత్రి ఏఓ సరెండర్

ఎంజీఎం: సీకేఎం ఆస్పత్రిని కలెక్టర్ డాక్టర్ సత్య శారద రెండు రోజుల క్రితం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో శానిటేషన్, సెక్యూరిటీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో వెలుగుచూసిన పలు ఘటనల నేపథ్యంతో ఏఓ సాజిద్‌ను సరెండర్ చేయాలని ఆమె డీఎంఈకి సిఫారసు చేశారు. ఏఓను కలెక్టర్ ఆదేశాలు ఆస్పత్రిలో చర్చనీయాంశంగా మారాయి.

లేఅవుట్ అనుమతులు మంజూరు

వరంగల్: కమిటీలో చర్చించి లేఅవుట్ అనుమతులు మంజూరు చేసినట్లు కోసం కలెక్టర్ సత్య శారద తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన లేఅవుట్ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీ పరిధిలో లేఅవుట్ అనుమతుల కోసం వచ్చిన ప్రతిపాదనలను చర్చించి అనుమతి మంజూరు చేశామన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీటీసీపీ రత్నకుమారి, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ జోనా, సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా రోడ్లు, భవనాల అధికారి జితేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రెడ్ క్రాస్‌లో 'సీనియర్ సిటిజన్స్ క్లినిక్'

హన్మకొండ అర్బన్: వయోవృద్ధుల ఆరోగ్య సంక్షేమం కోసం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సుబేదారిలోని రెడ్ క్రాస్ భవన్‌లో సీనియర్ సిటిజన్స్ క్లినిక్ ఏర్పాటు చేయనున్నట్లు రెడ్ క్రాస్ బాధ్యులు తెలిపారు. ఈ క్లినిక్ ద్వారా వయోవృద్ధులకు అనుభవజ్ఞులైన డాక్టర్ల ద్వారా ఉచిత కన్సల్టెన్సీలతో పాటు డయాగ్నస్టిక్ సెంటర్‌లో తక్కువ ధరలకే రక్త పరీక్షలు, జనరిక్ మందుల షాపులో తక్కువ ధరలకే మందులు లభించనున్నట్లు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థిని



కేయూ క్యాంపస్: చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని వర్షిణిప్రియ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి తెలిపారు. ఈమేరకు ఆ విద్యార్థిని బుధవారం అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కావ్యకు ప్రథమ బహుమతి



హన్మకొండ కల్చరల్: భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అమరావతిలోని హనుమంతరాయ గ్రంథాలయంలో అక్కినేని కళావేదికపై జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వరంగల్ ఫ్రెండ్స్ కల్చరల్ సంస్థకు చెందిన కావ్య టింగిల్‌కార్ వీరనారి రుద్రమదేవి ఏకపాత్రాభినయ పాత్ర పోషించి ప్రథమస్థానంలో నిలిచి బహుమతి అందుకున్నారు.

'రైతులు అధైర్యపడొద్దు'

వర్ధన్నపేట: నియోజకవర్గ వ్యాప్తంగా రుణమాఫీ కాని రైతులు ఎవరూ అధైర్య పడొద్దని, ప్రతిపక్ష నాయకుల మాటలు నమ్మి అపోహలకు గురికావొద్దని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రుణమాఫీ కాని రైతులు బ్యాంకు, పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, రుణం పొందిన బ్యాంకు ఖాతా వివరాలతో కూడిన పత్రాలను నియోజకవర్గ పరిధిలోని మండల అధ్యక్షులకు అందజేయాలని సూచించారు.

నిట్ స్పోర్ట్స్ అసిస్టెంట్‌కు డాక్టరేట్



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో స్టూడెంట్ యాక్టివిటీస్ అండ్ స్పోర్ట్స్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.రాకేష్‌కు కర్ణాటకలోని గుల్బర్గా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ అందజేసింది. ఎఫెక్ట్ ఆఫ్ ఇంటర్వెల్ ట్రైనింగ్ అండ్ కంటిన్యూయస్ ట్రైనింగ్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఎరోబిక్ ఎండ్యూరెన్స్ అండ్ ఎనరోబిక్ ఎండ్యూరెన్స్ అమంగ్ మిడిల్ డిస్టెన్స్ రన్నర్స్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై చేపట్టిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నట్లు రాకేష్ వివరించారు.

లావాదేవీలను బహిర్గతం చేయాలి

వరంగల్ చౌరస్తా: ప్రజల నుంచి వసూలు చేసిన రూ.75 లక్షల సొమ్ము వివరాలపై ప్రశ్నిస్తే కక్షపూరితంగా తమను సీపీఎం నుంచి వరంగల్ జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య సస్పెండ్ చేశారని బహిష్కృత నేతలు ముక్కెర రామస్వామి, మాలోతు సాగర్ వాపోయారు. హంటర్‌రోడ్డులో ఓ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 30 ఏళ్లుగా పార్టీలో కొనసాగుతూ కష్టపడుతున్నామన్నారు. చెప్పుడు మాటలతో సరైన ఆధారాలు చూపలేక, నోటీసులు జారీ చేయకుండా ప్రకటించడం సరికాదన్నారు. సమావేశంలో ఓదెలు, ప్రత్యూష, జ్యోతి, దాసు, రత్నం, మాధవి, మైరున్నీసా, లావణ్య, రఘుపతి, రాఘవరెడ్డి, యాకమ్మ, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

పొగమంచుతో అధిక ప్రమాదాలు

- రాత్రి పూట ప్రయాణాలు వాయిదా వేసుకోవాలి
- జైపాల్‌రెడ్డి, సీనియర్ ఎంవీఐ, వరంగల్ ఆర్టీఏ





ఖిలా వరంగల్: ప్రస్తుతం విపరీతమైన చలితోపాటు పొగ మంచు కురుస్తోంది. రహదారులను కమ్మేస్తోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఫాగ్ లైట్లు వాడితే 25మీటర్ల వరకు స్పష్టంగా చూడొచ్చు. నాలుగు చక్రాల వాహనం ఒకే లైటుతో ప్రయాణిస్తే ఎదురుగా వచ్చే వారు ద్విచక్ర వాహనమనుకుని, పక్కనుంచే వెళ్లే అవకాశం ఉంది. రెండు హెడ్‌లైట్లు డిప్ చేస్తూ ప్రయాణించాలి. మూలమలుపుల వద్ద అతివేగం పనికి రాదు. వాహనాలను ఓవర్‌టేక్ చేయడం వల్ల ఎదురుగా వచ్చేవి కనిపించవు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వెనుక లైట్లు వెలిగేలా చూసుకోవాలి. పొగ మంచులో కాంతి పరావర్తనం చెంది ఎదురు వాహనాలు కనిపించవు. వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు అతికించాలి. రహదారిని చూడగలిగే పరిస్థితులకు అనుగుణంగా వాహన వేగం ఉండాలి. ఇతర వాహనదారులు తమను గమనించేలా హజార్డ్ లైట్ వాడాలి. లోబీమ్ ఫాగ్ లైట్లు ఉండేలా చూడాలి. నేషనల్ హైవే, శివారు రహదారులపై వాహనాల మధ్య కచ్చితంగా దూరం పాటించాలి.

చిప్‌లు గట్టిపడి పనితనం మందగిస్తుంది

- మంచుకురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ ఉపయోగించొద్దు
- మయూర్, ఎలక్ట్రానిక్స్ టెక్నీషియన్, హనుమకొండ



హన్మకొండ చౌరస్తా: ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలలో పడిపోయినప్పుడు కంప్యూటర్లు, మొబైళ్లు, బ్యాటరీ, ప్రోగ్రామబుల్ లాజిక్ కంట్రోలర్లలో ఉండే మెటల్ కాంట్రాక్ట్‌లు ప్రభావితం అవుతాయి. ఎలక్ట్రానిక్స్ వస్తువుల లోపల ఉండే చిప్‌లు మైనస్ టెంపరేచర్‌లో గట్టిపడి పనితనం మందగిస్తుంది. అయితే బయటి దేశాలతో పోల్చితే ముఖ్యంగా తెలంగాణ ప్రాంతాల్లోని చలితీవ్రత చాలా తక్కువగా ఉంటుందని చెప్పొచ్చు. దీని వల్ల ఎలక్ట్రానిక్స్ వస్తువులపై అంతగా ప్రభావం ఉండదు. అలాగని మంచు కురిసే సమయంలో బయటి ప్రదేశాల్లో ల్యాప్‌టాప్, మొబైళ్లను వాడితే తెలియకుండానే మంచు లోపలికి వెళ్లే ప్రమాదం ఉంటుంది. నీటి తడితో విడిభాగాలు పూర్తిగా పాడవుతాయి. మంచు కురిసే ప్రాంతాల్లో ఎలక్ట్రానిక్స్ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం మంచిది. మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు కంప్యూటర్లు, మొబైళ్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ వస్తువుల విడి భాగాలపైన కొంత ప్రభావం చూపుతుంది తప్పితే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామ్స్‌పై ఎలాంటి ప్రభావం ఉండదు. కీప్యాడ్ మొబైళ్లు కొంత బిగుసుకుపోయే అవకాశం ఉంటుంది. ఇప్పుడంతా స్మార్ట్ ప్రపంచం. మొబైల్ బాగా వేడి అయినప్పుడు స్విచ్‌ఆఫ్ చేయడం మంచిది.

ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్యారాణి

వరంగల్: జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని వరంగల్ అదనపు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లాస్థాయి డీసీసీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలకు రూ.1,802.08 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు రూ.1,231 కోట్లు అందించారని వివరించారు. డీఆర్‌ఓ విజయలక్ష్మి, డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హవేలి రాజు, యూనియన్ బ్యాంకు డీఆర్‌హెచ్ మహేశ్, ఆర్బీఐ ఏజీఎం పల్లవి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వ్యవసాయ అధికారి అనురాధ, పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి సురేశ్ పాల్గొన్నారు.

ముళ్ల చెట్లు తొలగించారు



మడికొండ: మడికొండలోని పలు కాలనీల్లో ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చిమొక్కలను బుధవారం తొలగించారు. సాక్షి దినపత్రిలో బుధవారం ప్రచురితమైన జనావాసాల్లో ముళ్ల చెట్లు అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఈమేరకు ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. దీంతో భూ యజమానులు స్పందించి జేసీబీల సహాయంతో ముళ్ల చెట్లను తొలగించారు. ఈక్రమంలో సాక్షికి, అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఒలింపిక్స్ సంఘం అధ్యక్షుడు అజీజ్‌ఖాన్



హాకీ ఆడుతున్న అజీజ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాకారుల సంక్షేమం, క్రీడల అభివృద్ధే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష్యమని ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లాస్థాయి క్రీడా పోటీలను రెండో రోజు బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో కలిసి హాకీ ఆడి సందడి చేశారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. రెండో రోజు రెజ్లింగ్, బాక్సింగ్, లాన్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, షూటింగ్, హాకీ, కరాటే, రోయింగ్, స్క్వాష్, అత్యపత్య, పవర్ లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, సెపక్‌తక్రా, తైక్వాండో క్రీడాంశాలు ఎంపిక పోటీలు జరిగాయి. క్రీడాకారులకు వైద్యపరీక్షలు చేసి మందులు అందించినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు.

బాక్సింగ్ క్రీడాకారుల ఆందోళన

బాక్సింగ్ ఎంపికల వద్ద క్రీడాకారులు ఆందోళన వ్యక్తం చేశారు. బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీందర్‌కుమార్ పరుష పదజాలంతో దూషిస్తున్నాడని వాపోయారు. 500 గ్రాములు తక్కువగా ఉన్నారని తమను ఎంపికలకు దూరం చేశారని ధర్మసాగర్ మండల కేంద్రానికి చెందిన అఖిల్, శ్రీమాన్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలు మరో వారం రోజులు ఉన్నాయని అప్పటిలోపు అరకిలో బరువు సులువుగా పెరగొచ్చని క్రీడాకారులు అంటున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జ్ఞానేశ్వర్

- వరంగల్ విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్

ఖిలా వరంగల్: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని జిల్లా విద్యాశాఖ అధికారి మామిడి జ్ఞానేశ్వర్ సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట జంక్షన్‌లోని నాని గార్డెన్‌లో వడుప్సా వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో బొల్లం కనకయ్య అధ్యక్షతన బుధవారం పదో తరగతి పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈఓ హాజరై మాట్లాడారు. రతన్‌టాటా లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. లక్ష్యాన్ని ఎంచుకుని క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎంఈఓలు బత్తుల ప్రసాద్, గంప అశోక్, వడుప్సా ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సీహెచ్.నాగార్జున్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, కోశాధికారి రామ్మూర్తి, సలహాదారులు చంద్రారెడ్డి, ఆర్.రవి, సతీష్, జన్ను విలియమ్స్, సుధీర్, సుధాకర్, విద్యాసాగర్, రాజు, నసీరొద్దీన్, ఉస్మాన్, అశోక్, మాధవి, ఖలీల్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్, ఇనాయత్, సమీర్, గౌస్, మురళి, అవినాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో కమిషనర్



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే కుటుంబ సమేతంగా బుధవారం సందర్శించారు. ఈమేరకు ఆమెకు పర్యవేక్షకుడు అద్దంకి విజయ్‌కుమార్, ఆలయ అర్చకుడు భద్రకాళి శేషు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం కమిషనర్‌కు అర్చకులు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందించి మహాదాశీర్వచనం చేశారు.

కేయూలో హాస్టల్ విద్యార్థి న్యూసెన్స్?

హాస్టల్ నుంచి రెండువారాల సస్పెన్షన్
కేయూ హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ నిర్ణయం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సు మొదటి సంవత్సరం చదువుతూ న్యూపీజీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్న ఓ విద్యార్థి మంగళవారం రాత్రి న్యూసెన్స్ చేశారని సమాచారం. మద్యం తాగి హాస్టల్‌కు వచ్చి న్యూసెన్స్ చేస్తుండటంతో ఇతర విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ గోలను భరించలేక పలువురు విద్యార్థులు ఆ విద్యార్థిని కొట్టారని తెలిసింది. సమాచారం అందుకున్న కేయూ పోలీస్‌స్టేషన్ పోలీసులు.. న్యూసెన్స్ చేస్తున్న విద్యార్థిని అదుపులోకి తీసుకొని రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఉంచి బుధవారం ఉదయం వదిలేసినట్లు సమాచారం. ఈమేరకు హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ చేరుకుని ఆరా తీశారు. ఆ విద్యార్థిని రెండువారాల పాటు హాస్టల్ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

మైదానంలో రెండువర్గాల మధ్య వివాదం?

కాకతీయ యూనివర్సిటీలో మైదానంలో రెండు విభాగాలకు సంబంధించిన విద్యార్థుల మధ్య వివాదం తలెత్తినట్లు సమాచారం. రాత్రి 9గంటల సమయంలో కొంతమంది విద్యార్థులు క్యాంటీన్ ప్రాంతంలో గుమికూడి ఉండటంతో పోలీసులు యూనివర్సిటీలో పెట్రోలింగ్ చేసినట్లు తెలిసింది.

విద్యార్థులకు జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష



విద్యార్థులతో కట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు

కాశోజీ సెంటర్: వరంగల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి జీవశాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించడం వల్ల బోర్డు పరీక్షల్లో అధిక మార్కులు పొందుతారని తెలిపారు. తెలంగాణ జీవశాస్త్ర ఫోరం జిల్లా, రాష్ట్రస్థాయిలో పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. జిల్లాస్థాయి విజేతలకు ఈనెల 28న రాష్ట్రస్థాయి పరీక్షలు ఉంటాయని వివరించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శంభునిపేట పాఠశాల హెచ్‌ఎం వీర ఉపేందర్, ఫోరం రాష్ట్ర కమిటీ సభ్యులు చల్లా కృష్ణ, ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి పరమేశ్వర్, కోశాధికారి రమేశ్, ఉపాధ్యక్షురాలు ధనలక్ష్మి, ఇందిర పాల్గొన్నారు.

వినియోగదారుల ముంగిట సీజీఆర్‌ఎఫ్



వినతి పత్రం స్వీకరిస్తున్న అధికారులు

- చైర్మన్ ఎన్‌వీ.వేణుగోపాలచారి

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సీజీఆర్‌ఎఫ్ (విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక)ను వినియోగదారుల ముంగిటికి తీసుకువచ్చినట్లు పరిష్కార వేదిక చైర్మన్ ఎన్‌వీ.వేణుగోపాల చారి తెలిపారు. హనుమకొండ గోపాల్‌పూర్‌లోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో లోకల్ కోర్టు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ నక్కలగుట్టలోని సీజీఆర్‌ఎఫ్ కార్యాలయంలో నేరుగా, తపాలా ద్వారా, టీఎస్ఎన్‌పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో, ఈ మెయిల్ ద్వారా, 9440811299, 8333923840, 9491307004 నంబర్లలో ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ సభ్యులు కె.రమేష్, ఆర్.చరణ్‌దాస్, ఎస్ఏఓ అనిల్‌కుమార్, హనుమకొండ డీఈ జి.సాంబరెడ్డి, ఏడీ రాజు, ఏఈలు తారాచంద్, లక్ష్మణ్, నవీన్, రైతులు సంజీవ రావు, గోపాల్ రెడ్డి, జంగారెడ్డి, మోహన్ రావు, ఐలయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పరీక్షల్లో ఫెయిల్.. యువకుడి ఆత్మహత్య

మడికొండ: ఉరి వేసుకొని యువకుడు మృతి చెందిన సంఘటన కడిపికొండ శివారు ఇందిరమ్మ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవర చంద్రశేఖర్ (24)డిగ్రీలో ఉన్న బ్యాక్‌లాగ్ సబ్‌జెక్టులు పాస్ కాకపోవడంతో మనస్తాపం చెంది మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ తెలిపారు.

భారీగా గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం: నిషేధిత గుట్కా కేంద్రంపై దాడి చేసి రూ.7,23,400 విలువగల గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. రెడ్డికాలనీలో రాజ్‌పురోహిత్ మహేందర్ గోడౌన్‌పై దాడిచేసి గుట్కాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు అతడిని అదుపులోకి తీసుకొని హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. టాస్క్‌ఫోర్స్ దాడిలో ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, ఎస్సై దిలీప్, సిబ్బంది పాల్గొన్నారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్ట్

తిరుమలాయపాలెం: ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీలకు పాల్పడుతున్న వరంగల్ జిల్లాకు చెందిన ముఠాను పోలీసులు అరెస్ట్‌చేశారు. ఈ నెల 15న తిరుమలాయపాలెంలోని బంక్ పక్కన ఎయిర్‌టెల్ టవర్ వద్ద పాత ఇనుము, కాపర్ వైర్ దొంగిలించేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో ముఠా సభ్యులు ఆటోలో పారిపోయారు. ఈవిషయమై అందిన ఫిర్యాదుతో సీసీ ఫుటేజీ ద్వారా విచారణ చేపట్టగా వరంగల్‌కు చెందిన ముఠా సభ్యులు ఐదుగురు పట్టుబడ్డారని ఎస్సై కె.జగదీశ్ తెలిపారు. వీరిని విచారించగా పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ చోరీ చేసినట్లు అంగీకరించారని వెల్లడించారు. ఈమేరకు వరంగల్ లేబర్ కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఎల్లాస్వామితో పాటు వరంగల్ శివనగర్‌కి చెందిన చిరుపాటి సాలమ్మ, చిరుపాటి ఎల్లమ్మ, తూరుపాటి లక్ష్మి, తూరుపాటి సునీతను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మడికొండ ఔటర్ రింగ్‌రోడ్డుపై ఎలుకుర్తి క్రాస్ వద్ద జరిగింది. సోమిడి గ్రామానికి చెందిన బోయిని కొంరయ్య తన టీవీఎస్ వాహనంపై స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సోమిడికి వెళ్తుండగా హనుమకొండ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు అతన్ని ఢీ కొట్టింది. దాంతో కొంరయ్యకు గాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కాజీపేట: కాజీపేట ప్రధాన రహదారిపై డీ-మార్ట్ ఎదుట బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చేతి శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. విష్ణుపురి కాలనీకి చెందిన శ్రీనివాస్.. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీకొట్టగా శ్రీనివాస్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

పెద్ద వైద్యుడికి చూపిస్తానని మోసం

ఎంజీఎం: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు బత్తోజు విమలమ్మ చికిత్స కోసం బుధవారం ఎంజీఎం ఆస్పత్రికి వచ్చింది. ఓవ్యక్తి ఆమెతో మాట కలిపాడు. పెద్ద వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చూపిస్తానంటూ వృద్ధురాలి నుంచి మొదట రూ.500 తీసుకున్నాడు. అనంతరం మీ బిడ్డకు ఫోన్ పే చేస్తానని చెప్పి మరో రూ.500 తీసుకుని పరారయ్యాడు.

సంక్షిప్తంగా

కూల్చిన కార్మిక భవనాన్ని పునర్నిర్మించాలి

ఖిలా వరంగల్: దౌర్జన్యంగా కూల్చిన కార్మిక భవనాన్ని పునర్నిర్మించాలని, ఆజంజాహి మిల్లు భూములను పరిరక్షించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శివనగర్ ఏసీరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో నలిగంటి రత్నమాల అధ్యక్షతన వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, సీపీఐ సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఎంసీపీఐ నేతలు నర్ర ప్రతాప్, బండి కోటేశ్వర్, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, యాదగిరి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు రమక్క, కుమారస్వామి, సింగారపు బాబు హాజరై మాట్లాడారు. ప్రవీణ్, కుమార్, దుర్గయ్య, ఉదయ్‌కుమార్, వెంకన్న, సాంబమూర్తి, భవాని, ప్రశాంత్, రాధక్క, నీలక్క, లక్ష్మయ్య, అనిత, బాబు పాల్గొన్నారు.

వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

కాశోజీ సెంటర్: ఆజంజాహి మిల్లు కార్మికుల భవనాన్ని కూల్చివేసి కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, మిల్లు కార్మికులకు న్యాయం చేయాలని ఎంసీపీఐ(యూ) వరంగల్ జిల్లా కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు అదనపు కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కుమారస్వామి, మంద రవి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సహాయ కార్యదర్శి నర్ర పతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, ఐతం నాగేష్ పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని కాపాడాలి

వరంగల్: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే బాధ్యత యువతీ యువకులపై ఉందని గురు శివానందమూర్తి కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ గోపీచంద్ అన్నారు. ములుగు రోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో సద్గురు శివానంద మూర్తి 96వ జయంతి సందర్భంగా 'భారతీయ సంస్కృతి పరిరక్షణ - యువత పాత్ర' అనే అంశంపై బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మరొక ట్రస్టీ బండారు సాయి నారాయణ, ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ ఎల్లాప్రగడ సుదర్శన్ రావు, గండె ఉమాశంకర్, ప్రియాంక, ప్రణీత్, రామ్ రెడ్డి, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, రాంప్రసాద్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

కాజీపేట: పట్టణంలో కబ్జాదారుల చెరలో చిక్కి శల్యమవుతున్న ప్రభుత్వ స్థలాలను అధికారులు పరిరక్షించాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.చుక్కయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో కబ్జాకు గురవుతున్న భూములను గుర్తించి చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. సమావేశానికి జంపాల రమేష్ అధ్యక్షత వహించగా మండల కార్యదర్శి సాంబయ్య, తొట్టె మల్లేశం, మదన్నారి, విమల పాల్గొన్నారు.

వేగంగా ఇందిరమ్మ మోడల్ హౌజ్ పనులు

హసన్‌పర్తి: ఇందిరమ్మ మోడల్ హౌజ్ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇటీవల హసన్‌పర్తి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌజ్ పనులను ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద, స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులను హౌజింగ్ డీఈఈ సిద్ధార్థనాయక్ బుధవారం పర్యవేక్షించారు. డీఈఈ వెంట ఏఈ సిద్ధార్థ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్ తదితరులు ఉన్నారు.

పండ్లపై అవగాహన పెంచుకోవాలి



ఖిలా వరంగల్: ప్రీ ప్రైమరీ విద్యార్థులు పండ్ల రకాలు, వాటి ఉపయోగాలపై అవగాహన పెంచుకోవాలని ఏకశిల జీజీ స్కూల్ డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీస్కూల్‌లో వైస్ ప్రిన్సిపాల్ లవకుమార్ ఆధ్వర్యంలో ఫ్రూట్స్ డేను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. వివిధ పండ్ల వేషధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహ పెంపొందించుకోవాలి

న్యూశాయంపేట: యువత సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మార్క శంకర్‌నారాయణ సూచించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సామాజిక స్పృహ శాస్త్రీయ దృక్పథం అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతుల్లో శంకర్ నారాయణ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇంకా తమ దేశం కులం, మతం కోరల్లో చిక్కుకుని విలవిలలాడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. చదువుకున్న వాళ్లలో సైతం సామాజిక స్పృహ, శాస్త్రీయ దృక్పథం కొరవడుతోందన్నారు. ఎం.భిక్షపతి, అశోక్, వెంకట్రాజం, సారంగపాణి, సంపూర్ణ, రాములు, లక్ష్మి పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతుంది

హసన్‌పర్తి: క్రీడలతో క్రమశిక్షణ పెంపొందుతోందని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఎస్‌వీఎస్ విద్యాసంస్థలో నిర్వహిస్తున్న టెక్ క్వెస్ట్ -24లో భాగంగా బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలు నాలుగు రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు మాట్లాడుతూ క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం చేకూరుతోందన్నారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

నయీంనగర్: బాల్య వివాహాలను అరికట్టాలని, 18 ఏళ్లు నిండని అమ్మాయిలకు, 21 ఏళ్లు పూర్తికాని అబ్బాయిలకు వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలుశిక్ష విధించనున్నట్లు షేర్ ఎన్‌జీఓ కోఆర్డినేటర్ శిరీష తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనపై కేయూసీ రోడ్డు ఏకశిల హైస్కూల్‌లో అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శైలజ, ఏహెచ్‌టీయూ సీఐ వెంకన్న, రామారావు, శ్రీనివాస్, భాస్కర్, సుమలత, రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

నయీంనగర్: పెన్షనర్లకు నగదు రహిత హెల్త్ కార్డుల స్కీం ప్రారంభించి హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆల్ పెన్షనర్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం కోరారు. జాతీయ పెన్షనర్స్ వారోత్సవాల సందర్భంగా నయీంనగర్ యూనిట్ సమావేశం బుధవారం ఆదర్శ కాలనీలో అధ్యక్షుడు సముద్రాల రామాచారి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పెండాల బ్రహ్మయ్య, ఎన్.వీరన్న, టి.నిర్మల, పరికిపండ్ల వేణు, యాదగిరి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం

హసన్‌పర్తి: 66వ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏడీఈ అశోక్ తెలిపారు. కాలనీలో ఉన్న లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఏడీఈకు స్థానికులు బుధవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు యుగంధర్, వెంకటేశ్వర్లు, పట్టం శ్రీధర్, అనిల్, సురేష్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

23న రక్తదాన శిబిరం

నయీంనగర్: ఈనెల 23న మడికొండ క్వార్టంట్ కార్యాలయ ఆవరణలో ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో వంశీరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ డైరెక్టర్ కె.మురళీధర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఆర్‌సీఎస్ సభ్యులు పుల్లూరి వేణు, వేణుమాధవ్, మధుకర్ రెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం

వరంగల్: ఏనుమాముల ఆటో అడ్డాకు చెందిన ఆటో డ్రైవర్, కాశిబుగ్గ వాసి ముదిగొండ వీరస్వామి (62) మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను అడ్డా ఆటో యూనియన్ అధ్యక్షుడు సలీం నేతృత్వంలో రూ.10 వేలను సభ్యులు అందించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

హసన్‌పర్తి: క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని 55వ డివిజన్ పరిధిలో పనిచేసున్న కార్మికులకు బుధవారం దుస్తులు పంపిణీ చేశారు. తన సొంత ఖర్చులతో దుస్తులు అందజేసినట్లు కార్పొరేటర్ జక్కుల రజిత తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, శానిటరీ జవాన్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు స్వెటర్ల అందజేత

మడికొండ: మున్సిపల్ కార్మికులకు 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి స్వెటర్లను పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, జవాన్ మల్లయ్య, స్థానికులు పాల్గొన్నారు.

క్రీడాకారుడు ప్రశాంత్‌కు పురస్కారం

వరంగల్ స్పోర్ట్స్: క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు పారా క్రీడల అభివృద్ధికి చేస్తున్న కృషిని గుర్తించి హనుమకొండకు చెందిన పారా వాలీబాల్ క్రీడాకారుడు గాడిపెల్లి ప్రశాంత్‌ను రాష్ట్ర స్థాయి పురస్కారంతో తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ సత్కరించారు.

కేయూ పూర్వవిద్యార్థి విరాళం

కేయూ క్యాంపస్: కేయూ రాజనీతిశాస్త్ర విభాగంలో అలుమ్ని హాల్ అభివృద్ధి కోసం కాకతీయ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం పూర్వ విద్యార్థి, నల్లబెల్లి మండలం మాజీ ఎంపీపీ డాక్టర్ సాంగపాణి విరాళమిచ్చారు. ఆ విభాగ అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్‌కు రూ. 51 వేలను బుధవారం అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.